తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన సందర్భంగా మంగళవారం విమానాశ్రయంలో పీఎంను ఆసిఫ్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు చెన్నబత్తి ముఖేష్‌కుమార్, బీజేపీ గౌలిపుర డివిజన్ అధ్యక్షుడు రఘుకాంత్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు.
– మెహిదీపట్నం, చాంద్రాయణగుట్ట, మార్చి 19

కీర్తి పురస్కారానికి ఎంపికైన
నాట్య గురువు భారతి

ముషీరాబాద్, మార్చి 19: నాట్య గురువు, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డాక్టర్ ఎస్‌పీ భారతి కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. 42 సంవత్సరాలుగా కూచిపూడి నృత్య రంగంలో సేవలందిస్తున్నారు. తెలుగు విశ్వ విద్యాలయం కూచిపూడి విభాగం అధ్యాపకురాలిగా పని చేసిన ఆమె 193 పురస్కారాలను అందుకొని ప్రత్యేకతను చాటుకున్నారు. కాగా ఈ నెల 21న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో జరగనున్న కార్యక్రమంలో ఆమెకు కీర్తి పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.

అన్ని బీసీ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలి

ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య

ముషీరాబాద్, మార్చి 19: కులవృత్తులు కలిగిన అన్ని బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో జరిగిన 13 బీసీ సంఘాల సమావేశంలో పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ.. వెనుకబడిన కులాల సంక్షేమ, అభివృద్ధి కోసం ప్రతి కులానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి అవసరమైన నిధులు కేటాయించాలని కోరారు. బీసీ కులాల్లో నాయకత్వం పెరిగేలా ఏపీ తరహాలో అన్ని కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేయాలని, చైర్మన్‌తో పాటు ఎక్కువ మందిని డైరెక్టర్‌లుగా నియమించాలని అన్నారు. రాష్ట్రంలో ఉన్న 12 ఫెడరేషన్‌లను కార్పొరేషన్‌లుగా మార్చి పాలకమండళ్లను

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య

ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మెడిసిన్, ఇంజినీరింగ్, ఎంబీఏ, ఎంసీఏ వంటి ఉన్నత విద్య చదువులున్న బీసీ విద్యార్థులకు ఫీజు బకాయిలు, ట్యూషన్ ఫీజులను ప్రభుత్వమే భరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగా కోటేశ్వరి

తెలంగాణ బీసీ విద్యార్థి సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలిగా కోటేశ్వరిని నియమించినట్లు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమెకు నియామక పత్రా న్ని అందజేశారు. విద్యార్థుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం కలిసికట్టుగా ఉద్యమించాలని ఆయన సూచించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలి ..

కాచిగూడ,మార్చి 19: ఇంజినీరింగ్, మెడిసిన్, ఫీజీ, డిగ్రీ కోర్సులు చదివే విద్యార్థులకు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ, ఈబీసీ విద్యార్థులకు ఫీజులు మంజూరు చేయాలని కోరుతూ జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సలహాదారుడు నరేందర్‌రెడ్డికి ఆర్.కృష్ణయ్య వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ.. హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీల వెంకటేశ్, భూపేశ్ సాగర్, సి.రాజేందర్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను సన్మానించిన అతిథులు

మహిళలను గౌరవించాలి

తెలుగు యూనివర్సిటీ, మార్చి 19: మహిళలు విద్యను అభ్యసించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమని పలువురు వక్తలు అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాంగణంలోని ఆడిటోరియంలో తెలంగాణ ముదిరాజ్ జేఏసీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాలను మంగళవారం నిర్వహించారు. మహిళా శక్తిని గుర్తించి సమాజం గౌరవించాలని మాజీ మంత్రి కె. పుష్పలీల పిలుపునిచ్చారు. జేఏసీ మహిళా అధ్యక్షురాలు లింగాల పుష్పలత, కార్యదర్శి నీరజల నేతృత్వంలో సాగిన ఈ కార్యక్రమంలో ఈటల జమున, ముదిరాజ్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు పోలకం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ పగిడాల సుధాకర్, ప్రధాన కార్యదర్శి బీమా లక్ష్మణ్ ముదిరాజ్, నగర శాఖ అధ్యక్షులు గుండు నరసింహ ముదిరాజ్‌లు వివిధ రంగాల్లో కృషి చేస్తున్న మహిళలను సత్కరించారు.

హెచ్‌ఆర్ఏ తగ్గింపుపై పునరాలోచన చేయాలి

కవాడిగూడ, మార్చి 19: ఆర్టీసీ ఉద్యోగులకు హెచ్‌ఆర్ఏ తగ్గింపుపై పునరాలోచన చేయాలని తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దుబ్బాక యాదయ్య, ప్రధాన కార్యదర్శి బి. పద్మారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించి అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పీఆర్‌సీ ఫిట్‌మెంట్ 21 శాతానికి పెంచడంతో నిరాశతో ఉన్న ఉద్యోగులు మరుసటి రోజే హెచ్‌ఆర్ఏ 24 శాతం చేయడం బాధాకరమన్నారు. పీఆర్‌సీ 30 శాతం, హెచ్‌ఆర్ఏ యథావిధిగా ఉండేట్లు చర్యలు తీసుకోవాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అసోసియేషన్ చైర్మన్ పి. సుభాష్, సలహాదారు సుద్దాల సురేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వి. బాబు, కోశాధికారి బీడీ రావు, రాష్ట్ర కార్యదర్శి ఎం. రవీందర్, ప్రభాకర్, కేబీ నర్సింహా, హైదరాబాద్ యూనియన్ అధ్యక్షుడు రాజయ్య, కార్యదర్శి యదయ్య, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు నాగవాణికి మెమెంటోను అందజేస్తున్న ఎస్ఐ చందన

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కవాడిగూడ, మార్చి 19: మహిళలు వంటింటికే పరిమితం కాకుండా విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాలలో రాణించాలని, అప్పుడే మహిళలు అన్ని రంగాలలో రాణించగలుగుతారని సెంట్రల్ జోన్ ఉమెన్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ చందన అన్నారు. ఈ మేరకు మంగళవారం కవాడిగూడ డివిజన్‌లోని బండానగర్ కమ్యూనిటీహాల్‌లో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని అప్సా స్వచ్ఛంద సంస్థ, ఒక్క రూపాయి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కల్పించారు. ముందుగా వివిధ రంగాలలో రాణించి ఉత్తమ ప్రతిభను కనబరిచిన మహిళలను సత్కరించారు.

నేడు ఘంటసాల గంధర్వ గానామృతం

చిక్కడపల్లి, మార్చి19 : ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘంటసాల గంధర్వ గానామృతం నిర్వహించడం జరుగుతుందని నిర్వాహకులు డాక్టర్ టి.శరత్ చంద్ర తెలిపారు. మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ప్రముఖ సినీ నటులు సుమన్, ఎస్.కుమనన్, రామకృష్ణ, విజయ చౌరది, విరాజు, విజయ్ , శివారెడ్డి హాజరవుతారని తెలిపారు.

ప్రతి దళిత విద్యార్థికి విదేశీ విద్యానిధి వర్తింపచేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఫోరం ప్రతినిధులు

రవీంద్రభారతి, మార్చి19 : అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా పథకానికి దరఖాస్తు చేసుకున్న ప్రతి దళిత విద్యార్థికి విదేశీ విద్యానిధి వర్తింపచేయాలని నేషనల్ ఇంటెలెక్చ్యువల్ ఫోరం ఫర్ ఎస్సీ, ఎస్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ డిమాండ్ చేసింది. ప్రస్తుతం ఎస్సీ విద్యార్థులకు 200 మందికి మాత్రమే ఈ ఓవర్సీస్ విద్యా పథకం అమలు చేస్తున్నారని అన్నారు. ఈ మేరకు మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింత భగవాన్ ప్రసాద్, కార్యదర్శి డాక్టర్ జయరాం, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ పేరెంట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఎడవల్లి నర్సింహా, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ మాట్లాడారు. రామాంతపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ యాజమాన్యం జనరల్ కోటకింద సీట్లు పొందిన ఎస్సీ, ఎస్టీ ల విద్యార్థులకు ప్రభుత్వం ఇచ్చే స్కాలర్ షిప్‌లకు దరఖాస్తు చేసుకోకుండా వారి తల్లిదండ్రుల నుంచి అఫడవిట్ తీసుకుంటున్నారని ఇది సరికాదని వారు అన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు.
– గోల్నాక, మార్చి 19

స్వాతంత్ర్యోద్యమస్ఫూర్తితో ముందుకు సాగాలి

చిక్కడపల్లి, మార్చి 19 : నేటి యువత స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో అవినీతి పై పోరాటం చేయాలని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి అన్నారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో షాహిద్ భగత్‌సింగ్ స్మారక యువజోత్సవాలను పురస్కరించుకుని యువ కవి గాయకులు సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి జయరాజు, నాయకులు విజయకుమార్, జావేద్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటి సమస్యకు పరిష్కారం

ముషీరాబాద్, మార్చి 19: రాంనగర్ ఈ సేవా వద్ద ప్రధాన రోడ్డుపై మురుగు నీటి సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ఏడాది కాలంగా కొనసాగుతున్న మురుగు నీటి లీకేజీతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేక లైన్ ఏర్పాటుతో సమస్య పరిష్కారానికి నోచుకుంది. ఎమ్మెల్యే ముఠా గోపాల్ చొరవతో నిధులు మంజూరయ్యాయి. మూడు రోజుల క్రితం పనులు చేపట్టిన జలమండలి అధికారు లు యుద్ధ ప్రాతిపదికన నూతన పైపులైన్‌ను ఏర్పాటు చేసి ము రుగు నీటి లీకేజీ సమస్యను పరిష్కరించారు.

పదవులను అనుభవించి పార్టీ మారడం సరికాదు

అబిడ్స్, మార్చి 19 : బీఆర్ఎస్ పార్టీ ఎంతో ఆదరించినా పార్టీ అధికారం కోల్పోగానే అధికార పార్టీలో చేరుతున్న వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ సీహెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండి రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ నాయకులకు పదవులు అప్పగించడం జరిగిందని, పది సంవత్సరాల పాటు పదవులను అనుభవించిన నాయకులు అధికారం కోసం ఇరత పార్టీలను ఆశ్రయిస్తున్నారని ఆరోపించారు. పార్టీకి కష్ట కాలంలో ఆదుకున్న వారే నిజమైన నాయకులన్నారు. పార్టీ, ప్రభుత్వ పదవులను అనుభవించిన నాయకులు అధికారం కోసం అధికార పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారని ఆరోపించారు. ఎంత మంది పార్టీలు మారినా బీఆర్ఎస్ పార్టీకి జరిగే నష్టం ఏమీ లేదని, తెలంగాణ ప్రజలు తిరిగి బీఆర్ఎస్ పారీని అధికారంలోకి తీసుకు రావడం ఖాయమని ఆనంద్‌కుమార్‌గౌడ్ అన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రోడ్డు సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాయాదవ్

కాచిగూడ, మార్చి 19: డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. నింబోలిఅడ్డాలోని రైల్వే అండర్ బ్రిడ్జి రోడ్డు గత కొన్ని రోజులుగా కుంగిపోవడంతో ఆ దారిగుండ పోయే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని స్థానికులు ఫిర్యాదు చేయగా స్పందించిన కార్పొరేటర్ సిబ్బందితో కుంగిన రోడ్డును బాగుచేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్‌లోని సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరానికై కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రమేశ్‌యాదవ్, లావణ్య, మహేశ్, భీంరాజ్ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

క్రీడలను ప్రారంభిస్తున్న వైశ్యహాస్టల్ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్

కాచిగూడ, మార్చి 19: యువతలో ఉన్న ప్రతిభను వెలికితీయడానికి క్రీడలు ఎంతగానో దోహదపడుతాయని కాచిగూడ వైశ్యహాస్టల్ అధ్యక్షుడు ఉప్పల రాజేశ్వర్ అన్నారు. వైశ్యహాస్టల్ ఆధ్వర్యంలో బ్యాట్‌మెంటన్, చెస్, క్యారమ్, వాలీబాల్, టేబుల్‌టెన్నిస్, క్రికెట్ తదితర క్రీడలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజేశ్వర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రవిప్రసన్న కుమార్, కోశాధికారి రాజేశ్వర్‌రావు, స్పోర్ట్స్ చైర్మన్ వీరబోమ్మ శ్రీనివాస్, భాస్కర్‌గుప్త, కూర జయరాం తదితరులు పాల్గొన్నారు.

టోలీచౌకి ప్రధాన రోడ్డుకు మరమ్మతులు

ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇటీవల టోలిచౌకి ,నానల్‌నగర్ ప్రధాన రోడ్డులో ఓ ఆయిల్ గోడౌన్‌లో జరిగిన అగ్నిప్రమాదం కారణంగా ఆయిల్ మొత్తం రోడ్డుపై పారింది. ఆయిల్‌ను తొలగించడానికి రోడ్డుపై ఇసుక, కంకర పౌడర్‌ను వేశారు. ఇసుక కారణంగా రెండు రోజులుగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ రోడ్డుపై ఉన్న ఇసుక, కంకర పౌడర్‌ను తొలగించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం జీహెచ్ఎంసీ అధికారులు రోడ్డుపై ఉన్న ఇసుక, కంకర పొడర్‌ను తొలగించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. ఈ పనులను జీహెచ్ఎంసీ స్టాండింగ్‌కమిటీ సభ్యులు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ. నసీరుద్దీన్‌తో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు.– మెహిదీపట్నం మార్చి 19

శబ్ద కాలుష్యానికి కారణమైన ద్విచక్ర వాహనదారులపై కొరడా

సుల్తాన్‌బజార్,మార్చి 19: తీవ్ర శబ్దం చేస్తూ తోటి వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్న ద్విచక్ర వాహన దారులపై సుల్తాన్ బజార్ పోలీసులు కొరడా ఝులిపించారు. మంగళవారం కోఠి బ్యాంక్‌స్ట్రీట్‌లో సుల్తాన్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు నేతృత్వంలో ఎస్ఐలు కె. సుధాకర్, కె.సోమశేఖర్ స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా విఫరీతమైన శబ్దకాలుష్యాన్ని సృష్టిస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనాలపై చలాన్లను వేసి వాటి సైలెన్సర్‌లను తొలగించారు. ఇన్‌స్పెక్టర్ రాంబాబు మాట్లాడుతూ ..ఈ డ్రైవ్‌లో సుమారు 12 వాహనాలను గు ర్తించి సెలెన్సర్లను తొలగించినట్లు తెలిపారు.

‘పాతబస్తీలో విద్య, వైద్య సౌకర్యాలను మెరుగు పరుస్తాం’

అబిడ్స్, మార్చి 19 : పాతబస్తీ ప్రజలకు విద్య, వైద్య సౌకర్యాలను మెరుగు పర్చడంతో పాటు పేదరిక నిర్మూలన, పరిశుభ్రతకు పాటు పడతానని హైదరాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కొంపెల్ల మాధవీలత అన్నారు. నాంపల్లిలోని పార్లమెంట్ నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. నాలుగు దశాబ్దాలుగా పాతబస్తీలో అభివృద్ధి పూర్తిగా నిలిచి పోయిందన్నారు. పాతబస్తీ ప్రజల నుంచి సంపూర్ణ సహకారాన్ని పొంది రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించే దుకు పాటు పడుతున్నామన్నారు. తమ ఫౌండేషన్‌ల ద్వారా పాతబస్తీలోని అనేక ప్రాంతాలలో సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో యమన్‌సింగ్ పాల్గొన్నారు.

- చాంద్రాయణగుట్ట, మార్చి 19 : గౌలిపుర సుల్తాన్‌షాహిలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పాశం సురేందర్ ఇంటికి బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాధవీలత వెళ్లి కలిశారు. ఈ సందర్భంగా సురేందర్ కుటుంబ సభ్యులు ఆమెను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కైలాష్ గంగపుత్ర, జామల్‌పూర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు..

అంబర్‌పేట, మార్చి 19 : బాగ్ అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మల్లారెడ్డి బీజేపీలో చేరారు. ఈ మేరకు బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మల్లారెడ్డికి కాషాయ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డా.ఎన్.గౌతంరావు, మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు చుక్క జగన్ తదితరులు పాల్గొన్నారు.

- కాచిగూడ, మార్చి 19 : బర్కత్‌పుర నగర కార్యాలయంలో గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ కె.ఎస్. సోమ శేఖర్ మంగళవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు, మాజీ మంత్రి కృష్ణయాదవ్, ఆనంద్‌గౌడ్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

- బలరాంగల్లిలో కార్డన్ సెర్చ్
- సరైన పత్రాలు లేని 23 వాహనాలు, 17 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం
- అదుపులో 14మంది రౌడీషీటర్లు

కార్డన్ సెర్చ్‌లో స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్ రెడ్డి, గోషామహల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు మహేశ్, బాలు చౌహాన్ తదితరులు

అబిడ్స్, మార్చి 19 : రాబోయే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలలో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు తరచుగా తనిఖీలను చేపడతామని సౌత్ వెస్ట్ జోన్ డీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బలరాంగల్లిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సాయంత్రం ఐదున్నర గంటలకు ప్రారంభించి రెండు గంటల పాటు 150 మంది అధికారులు, సిబ్బంది ఇండ్లలో సోదాలు నిర్వహించి పత్రాలు సరిగా లేకుండా, నంబర్ ప్లేట్ సరిగా లేని 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా అక్రమంగా రీఫిల్లింగ్ చేస్తున్న 17 గ్యాస్ సిలిండర్లను అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు చేపడుతున్న కేంద్రాల నుంచి 23 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేస్తున్నారు. 14 మంది రౌడీ షీటర్లను అదుపులోకి తీసుకుని వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం బలరాంగల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. రాబోయే రెండు నెలల పాటు ప్రతి నిత్యం వాహనాల తనిఖీలను చేపట్టనున్నట్లు తెలిపారు. అంతే కాకుండా రౌడీషీటర్ల కార్యకలాపాలపై కన్నేసి ఉంచుతామని, జోన్ పరిధిలోని రౌడీషీటర్ల బైండోవర్ పీరియడ్ ముగిసిన వారిని తిరిగి బైండోవర్ చేస్తామని పేర్కొన్నారు. ఈ తనిఖీలలో గోషామహల్ ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి, మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ మహేశ్, డీఐ మహేందర్‌రెడ్డి, ఎస్ఐలు షేక్ అస్లం, అంబిక, వివిధ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

కవాడిగూడ, మార్చి 19: ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్, బ్యాంక్ ఆఫ్ అమెరికా సంయుక్త ఆధ్వర్యంలో ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ క్లాస్‌రూంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ముషీరాబాద్ విద్యా మండలి డిప్యూటీ ఐఓఎస్ స్వరూపరాణి కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించి విద్యార్థులకు శిక్షణ ఇచ్చే ఇద్దరు ఉపాధ్యాయులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడే డిజిటల్ క్లాస్‌లు, కంప్యూటర్ శిక్షణ, భవిష్యత్తులో ఉన్నత విద్యకు దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్లాన్ ఇండియా ఆర్గనైజేషన్ ప్రతినిధులు రాధాకృష్ణ, శ్రావణి, కీర్తన, అరుణా దేవి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రత్నం, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

కవాడిగూడ, మార్చి 19: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ గోడ్సల రచనశ్రీ తెలిపారు. ఈ మేరకు మంగళవారం డివిజన్‌లోని హూండాబాగ్‌లో చెడిపోయిన పవర్ బోర్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌లో చెడిపోయిన పవర్ బోర్‌ను జల మండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అన్నారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా అన్ని బస్తీలు, కాలనీలలో పవర్ బోర్‌లను రిపేర్ చేయించి సమస్యలు రాకుండా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. వెంకటేశ్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎ. ప్రభాకర్, నాయకులు అనిల్‌కుమార్, గద్దె శ్రీనివాస్, మోహన్ సాయి, వాటర్ వర్క్స్ డీజీఎం కార్తికేర్డ్డి, మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

చిక్కడపల్లి, మార్చి 19 : తమ ఇండ్లను అన్యాయంగా అధికారులు కూల్చివేశారని గాంధీనగర్ డివిజన్ స్వామి వివేకానంద నగర్ బస్తీ ప్రజలు చేపట్టిన నిరసన కార్యక్రమం 50 రోజులకు చేరుకోవడంతో బాధితులు బుధవారం క్యాండిల్ ర్యాలీని నిర్వహించారు. బస్తీ వాసులు ఎంబి కృష్ణ, నరేశ్, జ్ఞానేశ్, ఆనంద్ మాట్లాడుతూ అధికారులు తమ ఇండ్లను కూల్చి తమను రోడ్డు పాలు చేశారని, గత 50 రోజులు నిరసన, రిలే నిరాహారదీక్షలు చేస్తున్న అధికారులు పట్టించు కోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు సాయిరామ్, సువర్ణ, సునీత, ఇందు, భాగ్యలక్ష్మి, పూజారేఖ, లలిత తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారుల మధ్య వివాదం.. దాడి

పలువురికి గాయాలు.. అరెస్టు

సుల్తాన్‌బజార్, మార్చి 19 : నేల తుడిచే క్రమంలో నీళ్లు పడ్డాయనే వివాదంతో ఇద్దరు వ్యాపారులు దాడి చేసుకున్న ఘటన సుల్తాన్‌బజార్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపిన వివరాల ప్రకారం.. గౌలిగూడ జాంబాగ్ సిక్ గల్లీకి చెందిన నర్ఘత్‌లాల్ గుజరాతి గల్లీలో ఆషాపురా మొబైల్స్ విడిభాగాల వ్యాపారం చేస్తున్నారు. ఇదిలా ఉండగా నర్ఘత్‌లాల్ దుకాణం పైన ఉన్న ఆరిఫ్ మొబైల్ రిపేరింగ్ షాపును అక్బర్ నడుపుతున్నాడు. కాగా ఈ నెల 12వ తేదిన ఆరిఫ్ దుకాణంలోని నీళ్లు కింద ఉన్న నర్ఘత్‌షాపులోకి రావడంతో తన స్నేహితులతో కలిసి అక్బర్‌ను అడిగారు. ఈ విషయమై నర్ఘత్‌లాల్‌ను అక్బర్ దూషించడంతో ఆగ్రహానికి గురైన నర్ఘత్‌లాల్ అతని స్నేహితులు అక్బర్‌ను కొట్టారు. మరుసటి రోజు 13వ తేదిన సాయంత్రం నాలుగు గంటలకు నర్ఘత్‌లాల్